డబ్బుని ప్రేమించే భర్తకి ఆ ఇల్లాలు చెప్పిన గుణపాఠం!

# ఓ మనిషీ తెలుసుకో

డా॥ రాగతి పండరి కథ

"నీ పుట్టింటివారికి డబ్బు లేకపోతే మా సంబంధానికెందుకు ఎగబడ్డారు? అంత గతిలేనివాళ్లు కంతకు తగ్గ బొంతను వెతుక్కోవలసింది"

మామగారి తిట్లు వింటూ విమల దుఃఖం ఆపుకుంది. ఇంతలో అత్తగారు అందుకుంది.


"చిన్నకోడలు చిత్ర లక్షరూపాయలు కట్నం తెచ్చింది. సారె చీర మా అంతస్థుకి తగినట్టు తెచ్చింది. నువ్వూ వున్నావు దేభ్యం మొఖం పెట్టుకుని... మోసపోయాం నీలాంటిదాన్ని చేసుకుని. ఎప్పుడూ ఏడుపు మొఖమే. మా వాడెలా సంసారం చేస్తాడోగాని..."

రెండు సంవత్సరాలైంది పెళ్ళై. ఈ రెండు సంవత్సరాలనుండి ఇదే తంతు. అవే మాటలు. అత్తా, మామల్లో ఏ పరివర్తనా లేదు. విమల ఈ ఒక్కొక్క మాటను గుర్తుతెచ్చుకుని వందలసార్లు ఏడుస్తుంది. ఇంటికి వచ్చిన ప్రతివారిదగ్గరా అత్త, మామ తిట్టిపోస్తారు విమల పుట్టింటివాళ్లను. మరిది భార్య చిత్రను లక్ష కట్నం తెచ్చిందని నెత్తిమీద పెట్టుకుంటారు.

తెల్లారే లేవాలి. ఇంటెడు చాకిరీ చేయాలి. ఎవరికేం కావాలో అమర్చాలి. ఒక్కరోజు తలనొప్పిగా వుందని కూర్చుంటే అత్త పెద్ద రాద్ధాంతం చేస్తుంది. చిత్ర ఏ పనీ ముట్టుకోకపోయినా ఏమీ అనదు.

తన భర్త అన్నీ చూసినా చూడనట్టే ప్రవర్తిస్తాడు. అతనికీ తనమీద ప్రేమలేదు. డబ్బుమీదే ప్రేమ. తల్లి మాటలు విని అంటాడు,

"నా రేటు లక్షకు పైగా అయితే చవగ్గా కొట్టేశావ్ నన్ను. ఇంత చదువుకున్నవాడు, సంపాదిస్తున్నవాడు నాలాంటి భర్త దొరకడం నీ




అదృష్టం. ఏమంటావ్... ముష్టి ఏభై వేలిచ్చి మీ అమ్మానాన్నా చేతులు దులుపుకున్నారు'' అంటాడు.

విమలకి ఆ మాటలు ఎంతో బాధని కలిగిస్తాయి. ఈ ఇంట్లో తాను పరాయిదే అన్న భావన పదేపదే సతాయిస్తూ వుంటుంది. విమల భర్త అప్పలరావు ఇంట్లోనే వుండడు ఎప్పుడూ వీధిలోనే. పెళ్ళై ఇన్నేళ్ళైనా సినిమాకి, షికారుకి

భార్యని తీసుకెళ్లలేదు.

పెళ్లికి ముందు విమల అందరిలాగే ఎన్నో కలలు కన్నది. హీరోలాంటి భర్త - తనను ప్రేమగా చూసే భర్త - కానీ కట్నం తీసుకోకుండా పెళ్లిచేసుకున్న భర్త... అప్పుడు గొప్ప అనుభూతితో కూడిన ఆనందంతో గులాబీలు పూచిన కోటలు విహరిస్తున్నట్టు కలలొచ్చేవి. పెళ్లి తర్వాత తెలిసింది ఈ ప్రపంచమే ఒక బూటకం అని. బలిపశువులా భర్తముందు తల వంచడమే అని.

విమల మామగారు పేరుకి వీరభద్రం. కాని స్వభావం మాత్రం విరుద్ధం. అత్త కాంతమ్మ చేతిలో కీలుబొమ్మ. విమల్ని చూస్తే మాత్రం - నక్కి నక్కి వుండేవాడల్లా విరుచుకుపడి తిట్లు అందుకుంటాడు.

ప్రపంచంలో వున్నదే అది. మెత్తనోడ్ని చూస్తే మొత్తబుద్దేస్తుందని వూరికే అనరు. వీరభద్రం రిటైరై తీరిగ్గా వుంటున్నాడు ఇంట్లో. తినడం, తాగడం, నిద్రపోవడం, నిద్రరాకపోతే కోడలు విమల తల్లిదండ్రుల్ని కట్నం గురించి తిట్టిపోయడం ఇదే దినచర్య అతనిది.

విమల మరిది భార్య చిత్ర గర్విష్టి. అహంకారి. ధనవంతుడి కూతుర్నన్న గర్వం. ఎప్పుడూ టీవీ చూస్తూ కూర్చుని విమలతో పనులు చేయించుకుంటుంది. విమల పుట్టింటివాళ్ల బీదరికాన్ని ఎత్తిపొడుస్తూ మాటలంటుంది.

''వీళ్ల లక్షే కట్నం అడిగారు. మావాళ్లు రెండు లక్షలిచ్చారు'' అని గర్వంగా చెప్పుకుంటుంది.

కట్నం ఇవ్వడంకూడా చాలా గొప్ప అనుకునే స్త్రీలలో మార్పు రానంతవరకు వరకట్న పిపాసికి అడ్డు వుండదు అనుకుంది విమల.

వరకట్నం అనే సంకెళ్లలో బందీ అయిన స్త్రీ జీవితానికి ముక్తి ఎప్పుడు? ఏ విధంగా! ఎవరు చేస్తారు? ఇలా ఆలోచిస్తూ వుండగానే రోజులు గడచిపోతున్నాయి.

ఆరోజు ఎప్పటిలాగే తెల్లారిందిగాని పక్కింట్లోంచి అగ్నిసెగలు రావడంతో గుండెలు అదిరిపోయాయి.

పక్కింటివాళ్ల కోడలు గీత కిరసనాయిలు పోసుకుని అంటించుకుని చచ్చిపోయింది. ఆ నిజాన్ని విన్న విమలకి దుఃఖం పొర్లివచ్చింది. కట్నం ఎక్కువ ముట్టలేదని అత్తా, మామ, భర్త తనమీద కిరసనాయిలు పోసి అంటించారని గీత మరణవాఙ్మూలంలో చెప్పింది.

గీతకు పెళ్లై 6 నెలలు అయింది. ఒకసారి తన మనసులో బాధ విమలతో చెప్పుకుందికూడా. భర్త కొడతాడని, అత్త మామలు తిడతారని, డబ్బు తే తే అని పుట్టింటికి పంపిస్తారని.

విమలకి భయం పట్టుకుంది. తనని తన అత్తా, మామ, భర్త ఎప్పుడో ఒకప్పుడు అలాగే చంపేస్తారా? భర్త రెండో పెళ్లి చేసుకోవడానికి తయారవుతాడా?

ఈ దేశంలో వున్న దీనావస్థ ఇదే. భర్త భార్యని చంపాడని తెలిసినా -

రెండో పెళ్లైనా జరిపించడానికి తల్లిదండ్రులు తయారవుతారు. తరువాత తమ కూతురి భవిష్యత్ ఏమిటా అని ఆలోచించరు. వాళ్లకి కావలసింది పెళ్లి. ఏదో విధంగా జరిగిపోవడం.

ఆ రాత్రి ''నిన్ను అలా చంపనందుకు సంతోషించు, మేం ఎంత మంచివాళ్లమో మీ వాళ్లు తగిన పెట్టుపోతలు పెట్టకపోయినా పోనీలే అని వూరుకున్నాం. ఇంకెవరో అయితే రెండో

పెళ్ళికి తయారై నీ మీద కిరసనాయిలు వేసి కాల్చేసును'' అన్నాడు భర్త.

విమలకి అసహ్యం వేసింది భర్తంటే. అప్పుడే ఒక నిశ్చయానికి వచ్చింది విమల. భర్త కాంపుకెళ్లాడు. అత్తామామలు అప్పటివరకు తిట్టి తిట్టి నిద్రపోమన్నారు. రాత్రి 12 గంటలైంది. విమల కలం, కాగితం తీసుకుని ఉత్తరం రాయడం మొదలుపెట్టింది.

అప్పలరావుగారికి విమల రాస్తున్న ఉత్తరం. మొన్నటివరకు మీరునాకు భర్త. ఈరోజునుండి కాదు. ఎందుకంటే నా మనస్సు మారింది కనుక. నేనూ ఒక మనిషినే అని తెలుసుకున్నాను గనుక. నాకూ ఒక వ్యక్తిత్వం వుందిగనుక.

కట్నం తీసుకోవడం - మిమ్మల్ని మీరు అమ్ముకోవడం గొప్ప కాదండీ... కట్నం తీసుకోవడం గొప్ప కాదండీ... కట్నం తీసుకోవడం ఒక హీనమైన సంస్కారం. ఆడదాని డబ్బు ఆశించడం ఒక దుర్మార్గపు ఆలోచన. ఇంతవరకు నేను చాలా విసిగిపోయాను.

కట్నం కట్నం అంటూ ఆడదాని డబ్బుకోసం అలమటించే భర్త నాకొద్దు. భార్యా ఒక మనిషే అని గుర్తించని భర్త నాకొద్దు. జీవితమే డబ్బు అని భ్రమపడే భర్త నాకొద్దు. భార్యని ఈటెల్లాంటి మాటలతో చంపుకుతినే భర్త నాకొద్దు.

హాయిగా, ప్రశాంతిగా, సుఖమైన జీవితం నాకు కావాలి. మొగుడ్ని వదిలేసిన భార్యకి సంఘంలో స్థానం లేదనుకోకండి. ఈ సమాజంతో నాకుపనిలేదు. అన్యాయాన్ని ఎదిరించడమే నా కర్తవ్యం. మీలాంటివాళ్లల్లో మార్పు రాదు. మాలాంటివాళ్లే మారాలి.

డబ్బుని ప్రేమించే ఓ మగవాడా నన్ను భయపెట్టాలనుకున్నా సాధించలేవు. గుడ్‌బై...

విమల

ఉత్తరం రాసి టేబిల్‌మీద పెట్టి, పెట్టె తీసుకుని నిర్భయంగా చీకట్లో నడిచి వెళ్లిపోయింది విమల.

★

## గర్భస్థ శిశువు కలలు



మన పురాణాల్లో ఎన్నో కథలు విన్నాం. భారతంలో అభిమన్యుడు తల్లిగర్భంలో వున్నప్పుడు పద్మవ్యూహంలోకి చొచ్చుకుపోవడంవరకూ అర్జునుడు సుభద్రకు చెబుతుంటే గర్భంలో వున్న అభిమన్యుడు 'ఊ' కొట్టాడన్న కథ.

ఇది కేవలం పుక్కిట పురాణాలని . మనం తీసిపారేయనక్కర్లేదు. శిశువులు తల్లి గర్భంలోవున్నప్పుడు నిద్రపోవడమేకాదు, ఆ నిద్రలో కలలుకూడా కంటారట! గర్భిణీలలో అల్ట్రాస్కానింగ్ పరీక్షలు జరిపినప్పుడు శిశువుల పెరుగుదల విషయమే కాకుండ ఆకనుగుడ్ల కదలిక కూడా శాస్త్రజ్ఞులకు తెలిసింది. ఈ విధమైన కనుగుడ్ల కదలిక కలలు కంటున్నపుడే వుంటుందట! నిద్రపోతున్నవారి కనుగుడ్ల కదలికను గమనించి వారు కలలు కంటున్నారో, లేదా వట్టి నిద్ర పోతున్నారో మనమే నిర్ధారణ చేసుకోవచ్చు.

- సాటర్న్